క్లుప్తంగా

సమాచార హక్కుపై అవగాహన ఉండాలి



కొల్లిపర: ప్రభుత్వ సంస్థల నుంచి ప్రజలు, రైతులు కోరిన సమాచారం ఒక హక్కుగా పొందడానికి వీలు కల్పించిన చట్టం మే సమాచార హక్కు చట్టం 2005 అని, అటు వంటి చట్టం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉంది, చట్టం లోబడి సరైన సమాచారం పొందాలని ఏవో కె.వెంకటరావు అన్నారు. పంచాయతీ కార్యాలయాల్లో ప్రభుత్వం బుధవారం నిర్వహించిన గ్రామ సభల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సమాచార హక్కు చట్టం 2005 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాన్ని, అధికార యంత్రాగాన్ని ప్రజలకు జవాబుదారీ చేస్తూ ప్రభుత్వ పనితీరులో పారదర్శకత పెంచడం ఈ చట్టం ముఖ్య లక్ష్యమని అన్నారు. చట్టం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో స్క్రూడ్రైవర్‌తో దాడి

తెనాలిరూరల్: మద్యం మత్తులో బంధువుపై యువకుడు స్క్రూడ్రైవర్‌తో దాడి చేసిన ఘటన తెనాలి యడ్ల లింగయ్య కాలనీలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన నలుగురు యువకులు తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో రోడ్డుపై మద్యం తాగుతున్నారు. అదే సమయంలో అటుగా వెళుతున్న యువకుల బంధువైన టైలరింగ్ పనిచేసే గురు, బహిరంగంగా మద్యం తాగడంపై అసహనం వ్యక్తం చేశాడు. దీంతో యువకుల్లో ఒకడైన సాయి గురుపై స్క్రూడ్రైవర్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు.బాధితుడిని తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స కోసం గుంటూరు పంపారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి పడి యువకుడి మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి పడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు లెవల్ క్రాసింగ్ గేటు సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని బుధవారం పరిశీలించారు. సుమారు 28 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న యువకుడి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి జేబులో ఉన్న పత్రాల ఆధారంగా అస్సాంకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. గౌహతి నుంచి బెంగుళూరు వెళ్లే రైలులో ప్రయాణిస్తూ పడి ఉంటాడని నిర్ధారణకు వచ్చారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వెంకటాద్రి తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9440627554 నంబరులో సంప్రదించాలన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

తెనాలిఅర్బన్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో టుటౌన్ పోలీస్ స్టేషన్ ఎదురు రోడ్డులోని పేదలకు బుధవారం బియ్యం పంపిణీ చేశారు. అలాగే అక్కడున్న పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేయటమే కాకుండా పేదలను ఆదుకునేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు గుండు శివ, చెన్నూరి తిరుమల సాయి, పవన్, పండు, గోరంట్ల కళ్యాణ్, అఖిల్, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

'సత్యసాయి చేయూత'చే గాంధీ జయంతి



తెనాలి: 'సత్యసాయి చేయూత' ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అయితానగర్‌లోని గాంధీ విగ్రహం వద్ద గాంధీ జయంతిని నిర్వహించారు. ఎన్‌సీసీ సీనియర్ క్యాడెట్లు మాన్యం బద్రి, షేక్ ఫరీద్‌లు గాంధీ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. చిత్రలేఖన ఉపాధ్యాయుడు, ఎన్‌సీసీ మాజీ అధికారి బెల్లంకొండ వెంకట్ మాట్లాడుతూ గాంధీజీ జీవితవిశేషాలను తెలియజేశారు. ఆదర్శపురుషుడు, మార్గదర్శకుడైన గాంధీజీ చెప్పినట్టుగా చెడు అనవద్దనీ, వినవద్దనీ, కనవద్దనీ చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. ఎన్‌సీపీ కేర్‌టేకర్ విజయ్‌సింహా, సత్యసాయి చేయూత కోశాధికారి చుండూరి రఘురామ్‌గుప్తా ఎన్‌సీసీ క్యాడెట్లకు పేపర్ పెన్నులు, బిస్కట్లు పంపిణీ చేశారు.

బాపూజీ చూపిన మార్గం అనుసరణీయం

తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ



గాంధీజీ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించిన సంజనా సింహ

తెనాలి: 'నా జీవితమే నా సందేశం' అని చాటిన మహాత్మాగాంధీ ఆశయాలు, పాటించిన నియమాలు నేటికీ అనుసరణీయమని తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బుధవారం గాంధీ జయంతిని నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ సంజనా సింహ మాట్లాడుతూ గాంధీజీ అహింస అనే ఆయుధంతో దేశవ్యాప్తంగా ప్రజలను సమీకరించి, స్వాతంత్ర్య పోరాటాన్ని ఉధృతం చేశారని గుర్తుచేశారు. ఫలితంగానే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య భారతదేశం ఆవిర్భావానికి తోడ్పడ్డారని చెప్పారు. చెప్పారు. ఆయన అనుసరించిన విధానం, పాటించిన నియమాలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులు మల్లేశ్వరి, పద్మ, రాధిక, రాజు, సీసీ వరప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లిపర: మండల పరిధిలోనే వివిధ ప్రభుత్వ కార్యాలయంలో మహాత్మా గాంధీ 155 వ జయంతి సందర్భంగా బుధవారం గాంధీ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గాంధీ చిత్రపటానికి ఎంపీపీ భీమవరపు పద్మావతి, భీమవరపు సంజీవరెడ్డి, ఎంపీడీవో వి.విజయలక్ష్మి, తహసీల్దార్ సిద్ధార్థ రెవెన్యూ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్.ఐ పి.కోటేశ్వరరావు సిబ్బందితో కలసి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 20 గ్రామ పంచాయతీల్లోని ఆయా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది కార్యాలయంలో గాంధీ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి

తెనాలిఅర్బన్: జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాల సాధనకు అందరు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశానికి స్వాతంత్ర్యం తేవడానికి ఆయన చేసిన కృషి మరువరానిదని చెప్పారు. ఆయన అహింస సిద్ధాంతంను పాటిస్తూ అందరు దానిని అనుసరించేలా చూశారన్నారు. ఆయన బాటలో నేటి యువత నడవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. అనంతరం పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే అన్నాబత్తుని పురవేదిక వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మిపతి, మేనేజర్ దేవసేన, ఆరోగ్యాధికారిణీ డాక్టర్ హెలెన్ నిర్మల, ఆర్‌వో రాంప్రసాద్, ఎస్‌పీలు సుధాకర్, సుబ్బారావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, వైస్ చైర్మన్‌లు



జనసేన పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఓఎస్‌డీ యేసురత్నం

■ గాంధీ జయంతిని పురస్కరించుకుని బోసు రోడ్డులోని జనసేన పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన చిత్రపటానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఓఎస్‌డీ ఎన్ యేసురత్నం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ చూపిన బాటలో అందరు నడవాలన్నారు. స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాలు, పోరాటాలు మరువరానివన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు జిడుగు తులసీ, హరిదాసు గౌరిశంకర్, మామిడిబత్తుల సుబ్రమణ్యం, బెల్లపు యశ్వంత్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలో...

తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలో బుధవారం గాంధీజయంతిని నిర్వహించారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి నేతృత్వంలో జరిగిన వేడుకల్లో గాంధీజీ, కస్తూరిబా విగ్రహాలకు పూలమాలలు సమర్పించి, పూజలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పాటిబండ్ల వేణుగోపాల్, ఆశ్రమ నిర్వాహకులు, ఆశ్రమ ఆశ్రితులు పాల్గొన్నారు.



గాంధీ జయంతి వేడుకల్లో వజ్రాల, డాక్టర్ వేణుగోపాల్

శాంతి సహనమే మహాత్ముని మార్గం



చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: శాంతి, సహనమే మహాత్ముని మార్గమమని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని తెనాలి తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల చిత్రపటాలకు సిబ్బందితో కలసి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రపంచానికి అహింసా విధానాన్ని తెలియజేసిన గాంధీ మార్గం అనుసరణీయమన్నారు. కోపతాపాల కారణంగానే సమాజంలో అనేకులు జీవితాలను పాడు చేసుకుంటున్నారని, గాంధీ సూచించినట్టు శాంతి, సంయమనంతో జీవించాలని సూచించారు. అలానే మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి దార్శనికత, తగ్గింపు స్వభావం తరతరాలను సూపర్తినిస్తూనే ఉంటాయన్నారు. గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చూపిన మార్గంలో పయనించాలని సిబ్బందికి సూచించారు.

గాంధీజీ అహింసా సిద్ధాంతం ప్రపంచానికి ఆదర్శం

గాంధీ జయంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: ఆధిపత్యం కోసం పలుదేశాల మధ్య యుద్ధాలు జరుగుతూ, హింస వెల్లువెత్తుతున్న నేటికాలంలో గాంధీజీ అహింస సిద్ధాంతాన్ని విశేషంగా ప్రాచుర్యంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నాబత్తుని శివకుమార్ అభిప్రాయపడ్డారు. గాంధీ జయతి రోజైన బుధవారం స్థానిక గాంధీ చౌక్‌లో పూజ్యబాపూజీ విగ్రహానికి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాలలు సమర్పించారు. శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ అహింస అనే ఆయుధంతో ప్రపంచంలోనే రెండో అతి పెద్ద దేశమైన భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహానుభావుడు గాంధీజీ అని గుర్తుచేశారు. మనందరం ఆయన వారసులం కావటం గర్వకారణమన్నారు. గాంధీజీ జీవితం నేటి యువతకు గొప్ప సందేశమని చెబుతూ యువతరం చరిత్రనుతెలుసుకుని మంచిని ఆచరించాలని సూచించారు. మరింత ముందుకు వెళ్లేందుకు సారథ్యం వహించాలని చెప్పారు. బాపూజీ సూచించిన గ్రామస్వరాజ్యాన్ని తీసుకొచ్చేందుకు గత అయిదేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కృషిచేసిందని శివకుమార్ చెప్పారు. శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమం వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి మాట్లాడుతూ గాంధీ తత్వమంటే మానవత్వమేనని చెప్పారు. పాపాన్ని ద్వేషించ ండి... మనిషిని కాదు' అని ప్రపంచానికి చాటిన మహనీయుడు గాంధీజీ అని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుగూ స్థానిక స్వపరిపాలనతో గ్రామస్వరాజ్యం కోసం గాంధీజీ ఆనాడే కలలుగన్నారని చెప్పారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ తన ప్రసంగంలో గాంధీజీ,జీవితంలో ప్రతి అడుగు ప్రజలకు మార్గదర్శకమన్నారు. కౌన్సిలర్ కొత్ర యశోద గాంధీజీ మహోన్నతుడని చెప్పారు. మున్సిపల్ వైస్‌చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు షేక్ మొగల్ అహ్మద్, అవుల కోటయ్య, గొడవర్తి సాయిహరేరామ్, మల్లెబోయిన రాము, వంపుగళ్ల కృష్ణ, కఠారి హరీష్, పెదలంక వెంకటేశ్వర్లు, కుర్రా శ్రీను, కో-ఆప్షన్ సభ్యుడు బచ్చనబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, డాక్టర్ రియాజ్‌ఖాన్, తాడిబోయిన రమేష్, బూరెల దుర్గాప్రసాద్, కాకి దేవసహాయం, మన్నవ ప్రభాకర్, కాళిదాసు సత్యం, యలవర్తి సాంబశివరావు, లక్కరాజు లక్ష్మణరావు, కోలా వాసు, గుంటూరు కృష్ణ, కొల్లా గురునాధ గుప్త, నాగసరపు కృష్ణ, అద్దేపల్లి శివనాగేశ్వరరావు, బండ్లమూడి నాని, టెక్స్ బాల, షేక్ మీరావలి, చుండూరు సాయి పాల్గొన్నారు.



పార్టీ నేతలతో కలిసి గాంధీజీకి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్

హిందీ ప్రచారోద్యమంలో ప్రేమీమండలి ఘనత అపారం

22వ వార్షిక గురుపీఠ పురస్కారాలప్రదానోత్సవ సభలో డాక్టర్ మోహనరావు, డాక్టర్ నిర్మలాదేవి



డాక్టర్ కొల్లి మోహనరావుకు పురస్కారం ప్రదానం చేస్తున్న నిర్వాహకులు



డాక్టర్ నిర్మలాదేవి చిట్టిళ్లకు పురస్కారం..

తెనాలి: రాష్ట్రంలో స్వాతంత్ర్య ఉద్యమకాలం నుంచి హిందీ ప్రచారోద్యమంలో హిందీ ప్రేమీమండలి మహావిద్యాలయం ఘనత వహించిందని, విద్యాలయం సారథులు బోయపాటి నాగేశ్వరరావు దంపతుల నిస్వార్థమైన కృషి గొప్పదని ఏలూరుకు చెందిన హిందీ ప్రచారోద్యమ ప్రముఖుడు డాక్టర్ కొల్లి మోహనరావు అన్నారు. వారి పేరుతో ఇస్తున్న గురుపీఠ పురస్కారాన్ని స్వీకరించడం, హిందీ ప్రచారంలో కొనసాగాల్సిన గురుతర బాధ్యతను గుర్తుచేసిందని చెప్పారు. స్థానిక నాజరుపేటలోని హిందీ ప్రేమీ మండలిలో బుధవారం గాంధీ జయంతిని, బోయపాటి నాగేశ్వరరావు- సుభద్రాదేవి గురుదంపతుల 22వ వార్షిక గురుపీఠ పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రేమీమండలి అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షత వహించారు. సత్కార గ్రహీతల్లో ఒకరైన డాక్టర్ కొల్లి మోహనరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ స్వరాజ్య పోరాటం కాలం నుంచీ హిందీ ప్రచార ఉద్యమంలో ప్రేమీమండలి కృషిని వివరించారు. మరో పురస్కార గ్రహీత, విశాఖపట్టణంలోని నేవీ చిల్డ్రన్ స్కూల్ హిందీ అధ్యాపకురాలు, రచయిత, అనువాదకురాలు డాక్టర్ నిర్మలాదేవి చిట్టిళ్ల మాట్లాడుతూ, తెనాలి రామకృష్ణ నడయాడిన ప్రాంతం, గాంధీజీ అడుగిడిన ప్రదేశంలో గురుపీఠ పురస్కారం తీసుకోవటం తన పూర్వజన్మ సుకృతమని చెప్పారు. తన తల్లిదండ్రులు హిందీ ఉపాధ్యాయులనీ, ఆ భాషపై వారికి గల ప్రేమానురాగాలతో తమ కుటుంబం మొత్తం హిందీ నేర్చుకుని హిందీ అధ్యాపకులుగా స్థిరపడినట్టు తెలిపారు. అనువాదకురాలుగా, రచయితగానూ కృషిచేస్తూ హిందీ భాషావ్యాప్తికి తనవంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు. డాక్టర్ దక్షిణామూర్తి గాంధీజీ జీవిత విశేషాలను తెలియజేశారు. ప్రేమీమండలి తొలుత తిలక్ జాతీయ పాఠశాలగా ఉన్నపుడు గాంధీజీ స్వయంగా ఇక్కడకువచ్చి, జెండా ఆవిష్కరించినట్టు చెప్పారు. తొలుత డాక్టర్ కొల్లి మోహనరావు, డాక్టర్ నిర్మలాదేవి చిట్టిళ్లను గురుపీఠ పురస్కారాలతో సత్కరించారు. నగదు బహుమతిని అందజేశారు. అయినాల మల్లేశ్వరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రేమీమండలి సెక్రటరీ/కరస్పాండెంట్ డాక్టర్ ఈలప్రోలు శ్రీనివాసరావు, కస్తూరి పర్యవేక్షించారు. హిందీ ఉపాధ్యాయులు ఉప్పలపాటి మల్లేశ్వరి, కళ్యాణపావని, అరవింద విద్యాకేంద్రం సంపూర్ణ, యడ్ల మోహనరావు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. స్వచ్ఛ తాహీసేవా ముగింపు కార్యక్రమంలో భాగంగా మార్కెట్ ఏరియాను బుధవారం ఊడ్చి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని 40 వార్డులలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. అన్ని వార్డులలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మిపతి, మేనేజర్ దేవసేన, ఆరోగ్యాధికారిణీ డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఎసీపీలు సుబ్బారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోండి

తెనాలిఅర్బన్: సెలవుదినాలలో పట్టణంలోని కొన్ని కళాశాలలు, స్కూల్‌లు తరగతులు నిర్వహిస్తున్నారని, అలాంటి విద్యాసంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గాంధీ జయంతి రోజున తెరిచిన పలు విద్యాసంస్థలను బుధవారం వారు మూయించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాసంస్థల యాజమాన్యాలకు ఎన్ని సార్లు చెప్పిన ప్రయోజనం ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దినేని కిరణ్ బాబు, నాయకులు గుండు శివ, తిరుమల సాయి, పవన్, అన్నం తేజ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సత్యాగ్రహ దీక్ష

రేపల్లె రూరల్: మున్సిపల్ స్కూళ్లలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం రేపల్లె మున్సిపల్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. మున్సిపల్ స్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్లకు సీనియారిటీ ప్రకారం ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించాలని, ఉపాధ్యాయులకు జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, హైస్కూళ్లలో పనిచేస్తున్న సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, మెర్జింగ్ స్కూల్స్‌లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మృత్యుంజయరావు, రత్నబాబు, శ్రీనివాసరావు, రవిబాబు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

కర్లపాలెం: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపి తరలించే వారిపై చట్టప్రకారం కేసులు పెడతామని కర్లపాలెం ఎస్‌ఐ రవీంద్ర హెచ్చరించారు. కర్లపాలెం మండల పరిధిలోని యాజలి గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం కర్లపాలెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రవీంద్ర వివరించారు.

రక్తదాత ప్రేమ్‌కుమార్‌కు అభినందన



తెనాలి: సమాజసేవలతోపాటు 29 పర్యాయాలు రక్తదానం చేసిన ఆర్టీసీ తెనాలి డిపో జూనియర్ అసిస్టెంట్ ఈపూరి ప్రేమ్‌కుమార్‌ను బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ కమిటి, అంబేద్కర్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పట్టణ చినరావూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట సత్కరించారు. జాతీయ రక్తదాన దినోత్సవం రోజైన మంగళవారం రాత్రి ఈ సత్కారాన్ని చేశారు. తెనాలి రూరల్ మండలం పెదరావూరు గ్రామానికి చెందిన ఈపూరి ప్రేమ్‌కుమార్ తెనాలి ఆర్టీసీ డిపో కండక్టర్‌గా సుమారు 28 ఏళ్లు, పని చేసి జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది గత ఆరేళ్లగా ఇక్కడే పనిచేస్తున్నారని వక్తలు చెప్పారు. మరోవైపు సమాజసేవ, రక్తదానం ఆయనకు ఇష్టమైన అంశాలుగా తెలిపారు. కరోనా కాలంలో డిపో పరిధిలో వైద్యశిబిరాలను ఏర్పాటుచేసి, తాను ఆరుసార్లు రక్తదానం చేశారని తెలిపారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఆళ్లమూడి ప్రభాకరరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమానికి పులివర్తి లక్ష్మయ్య, గుంటూరు కోర్టు సీనియర్ ఏపీపీ సుద్దపల్లి సుకుమార్, కూచిపూడి రాజేష్ కుమార్, మాజీ ఎపీపీ ఇందుపల్లి రాజారామ్, న్యాయవాదులు ఉప్పుటూరి శరత్, మానుకొండ లెనిన్ వర్మ, గద్దల ఆల్విన్ బాబు, సుద్దపల్లి మురళీధర్, ప్రసాద్, ఉపాధ్యాయులు లక్ష్మణ్ కుమార్, గుంటూరు నాగేశ్వరరావు, బీఎస్ఎన్ఎల్ మాజీ ఉద్యోగి సీహెచ్ భాస్కరరావు, అత్తోట శ్యామ్‌బాబు, పట్టణ ఎమ్మార్పీయస్ నాయకుడు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



గాంధీ విగ్రహం ముందు ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

తెనాలిఅర్బన్: అపరిష్కతంగా ఉన్న మున్సిపల్ టీచర్స్ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని యుటీఎఫ్ జిల్లా నాయకులు గయాసుదౌలా, సాంబశివరావులు డిమాండ్ చేశారు. యుటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మార్కెట్ ముందు ఉన్న గాంధీ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూల్స్‌లో ఖాళీగా ఉన్న పోస్టులలో ఉపాధ్యాయుల నియామకాలు జరపాలని కోరారు. అలాగే సీనియర్‌లకు ప్రమోషన్‌లు ఇవ్వాలని, జీపీఎఫ్ ఖాతాలు తెరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కేధర్నాథ్, డీవీఆర్ ప్రసాద్, కె.సుందరరావు, ప్రసన్నత్ పాల్గొన్నారు.

భారతీయ స్టేట్‌బ్యాంక్ ఉద్యోగుల స్వచ్ఛతా సేవా

తెనాలి:భారతీయ స్టేట్‌బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం, తెనాలి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక చినరావూరు పార్కులో స్వచ్ఛతా సేవా నిర్వహించారు. ఆ బ్యాంకుకు తెనాలిలో గల అన్ని శాఖల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. పార్కులో చెత్తను ఊడ్చి పరిశుభ్రం చేశారు. బ్యాంక్ కేంద్ర కార్యాలయం పిలుపు మేరకు దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగానే తాము ఈ సేవలో పాల్గొన్నారు. బ్యాంక్ ప్రాంతీయ అధికారి వి.వి. జగదీష్‌కుమార్ వెల్లడించారు. సమాజంలోని ప్రతిఒక్కరూ తమ ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని రోగాలకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. బ్యాంక్ అధికారులు తిరుమలేశ్వరరావు, కర్ల శ్రీనివాస్, రేణుకుమార్, నారాయణరెడ్డి, ప్రవీణ్, విజయకుమార్, బ్యాంక్ ఉద్యోగుల జోనల్ కార్యదర్శి రావిపాటి ప్రేమ్, మణికంఠశాస్త్రి, సాయి లక్కరాజు,ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

